సాక్షి మంచిర్యాల

ఆదివారం । 5 । మార్చి । 2023



సో'ఫా'లో' మీడియా

ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీల నాయకులు సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై దృష్టి సారించారు. రోజువారీగా కార్యక్రమాలు, పర్యటనలు ఫొటోలతో పోస్టు చేయిస్తున్నారు. 8లో▸



నేడు గురుకుల సీఓఈ సెట్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంక్షేమ గురుకుల సీఓఈ సెట్ ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకోసం 14పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు నోటీసులు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశం
- మందమర్రి టోల్ ప్లాజా విచారణలో పార్టీ చేస్తూ ఉత్తర్వులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 363 మందమర్రి టోల్ ప్లాజా ఫిర్యాదుపై న్యాయ విచారణలో జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఉదయ్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారు. శనివారం టోల్ ప్లాజా ఫిర్యాదుపై మరోమారు విచారణ జరిగింది. జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణం పూర్తి కాకముందే కలెక్టర్ స్వయంగా వచ్చి మందమర్రి టోల్ ప్లాజాను ప్రారంభించారని, ఫిర్యాదుదారు, న్యాయవాది చేను రవికుమార్ కార్యదర్శి దృష్టికి తెచ్చారు. ఈ విచారణలో కలెక్టర్‌ను కూడా పార్టీ చేయాలని కోరగా, ఈ మేరకు నోటీసులు ఇవ్వాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక గత విచారణ సందర్భంగా ఎన్‌హెచ్, టోల్‌ప్లాజా అధికారులను పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించగా, తాజాగా ఇరుపక్షాల నుంచి అధికారులు విచారణకు గైర్హాజరయ్యారు. ప్రతివాదులు హాజరుకాకపోవడంతో తదుపరి విచారణ ఈ నెల 25వరకు వాయిదా వేశారు. శనివారం విచారణ నిమిత్తం ఎన్‌హెచ్, టోల్‌ప్లాజా అధికారులు జిల్లా కోర్టు ప్రాంగణం వచ్చినప్పటికీ ఏ కోర్టులో విచారణ జరుగుతుందో తెలియక సమయానికి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ముందు హాజరు కాలేకపోయినట్లు తెలిసింది. సకాలంలో హాజరు కానందున విచారణకు గైర్హాజరైనట్లు అయింది. దీంతో ఈ కేసు మరోసారి విచారణ వాయిదా పడడమే కాక అధికారులు కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం జరిగింది.

'బీజేపీని ప్రజల్లోకి తీసుకెళ్లండి'



ఇందన్‌పల్లిలో కార్యకర్తలతో బండి సంజయ్

జన్నారం: ప్రధాని నరేంద్రమోదీ పథకాలను వివరిస్తూ బీజేపీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని కార్యక్రమానికి వెళుతూ ఆయన శనివారం సాయంత్రం జన్నారం మండలం ఇందన్‌పల్లిలో ఆగి కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మండల సమస్యలు, గిరిజనుల పోడు భూములు, ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తాను ప్రత్యేకంగా మాట్లాడుతానని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు గోలి చందు, ప్రధాన కార్యదర్శి వంగపెల్లి సురేశ్, బీసీ మోర్చా అధ్యక్షుడు అనిల్‌యాదవ్, బీజేవైఎం, బీజేపీ నాయకులు మహేశ్, విద్యాసాగర్, మల్లేశ్, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

పరీక్షలకు 470 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థులకు శనివారం నైతికత–మానవ విలువలు పరీక్ష నిర్వహించారు. 7,011 మంది విద్యార్థులకుగాను 6,541 మంది హాజరయ్యారు. 470 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షల కేంద్రాన్ని డీఐఈవో శైలజ పరిశీలించారు.

ట్రాఫిక్ ఠాణాకు | మోక్షమెప్పుడో..!



పెట్రోల్ బంకు నిర్మాణానికి కేటాయించిన స్థలం



హోంగార్డ్ భవనంలో కొనసాగుతున్న ట్రాఫిక్ ఠాణా

- హోంగార్డ్ భవనంలోకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్
- ఇరుకు గదుల్లో సిబ్బంది ఇబ్బందులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో ట్రాఫిక్ పోలీసులకు కష్టాలు మొదలయ్యాయి. ఠాణాను మరోచోటికి మార్చడంతో కొత్త భవనం నిర్మాణం అయ్యే వరకు తిప్పలు తప్పని పరిస్థితులు ఎదురయ్యాయి. ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పాత భవనం స్థలాన్ని పోలీసు పెట్రోల్‌బంక్ నిర్మాణానికి ఎంపిక చేశారు. దీంతో స్థానిక మహిళా పోలీసుస్టేషన్ వెనుకాల ఉన్న హోంగార్డు భవనంలోకి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను వారం రోజుల క్రితం మార్చారు. పాత ట్రాఫిక్ పోలీసుస్టేషన్ స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులకు అప్పగించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించడంతో హడావుడిలో ఎక్కడికి మార్చాలో తెలియక నూతన ట్రాఫిక్ ఠాణా భవనం నిర్మాణం జరిగే వరకూ తాత్కాలికంగా హోంగార్డు భవనంలోకి మార్చారు. ఇక్కడ గదులు ఇరుకుగా ఉండడంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యలతో కుస్తీ పడుతున్న పోలీసులకు కాస్త విరామం తీసుకునేందుకు ఠాణా లేకపోవడంతో సిబ్బంది అవస్థలు పడాల్సి వస్తోంది.

పోలీస్‌పెట్రోల్ బంకు నిర్మాణానికి శ్రీకారం

పోలీసు సేవలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ముందుకు సాగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీసుశాఖకు పెద్దపీట వేస్తున్న సర్కారు మరో అడుగు ముందుకు వేసింది. ఇదివరకే పోలీసుస్టేషన్ల నిర్వహణ నిమిత్తం ఒక్కో స్టేషన్‌కు గ్రేడ్ల వారీగా రూ.25వేల నుంచి రూ.75వేల వరకు అందజేస్తోంది. ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు రూ.25వేలు నిర్వహణ ఖర్చుల కింద నెలనెలకు అందిస్తోంది. పైగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఖరీదైన వాహనాలు అందజేసింది. వాహనాలకు అవసరమైన పెట్రోల్ అందించేందుకు, పైగా పోలీసుశాఖ ఆదాయం పెంచుకునే దిశలో రాష్ట్ర పోలీసు శాఖ పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు జిల్లా కేంద్రాల్లో పోలీసు పెట్రోల్‌బంక్‌లు ఏర్పా టు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం మంచిర్యాలలో సైతం పెట్రోల్‌బంక్ మంజూరైంది. పెట్రోల్‌బంకు ఏర్పాటుకు స్థానిక పోలీస్ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇటీవల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) లిమి టెడ్ యాజమాన్యం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పాత భవనాన్ని కూల్చి వేసి పెంట్రోల్‌బంకు నిర్మాణానికి కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను హోంగార్డ్ భవనంలోకి తరలించారు.

రెండేళ్ల క్రితమే మంజూరు..

ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పాత భవనం శిథిలావస్థకు చేరడంతో గత రెండేళ్ల క్రితమే ట్రాఫిక్ ఠాణా భవనం మంజూరైంది. కానీ నూతన భవన నిర్మాణానికి స్థలం పరిశీలించడంలో అధికారులు అలసత్వం వహించారన్న ఆరోపణలున్నాయి. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమే అయింది. అయినా అది నేటికీ మోక్షం లభించలేదు. ప్రస్తుతం పెట్రోల్ బంకు ఏర్పాటుతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అత్యవసరంగా ఖాళీ చేయాల్సిన అవసరం ఏర్పడడంతో నూతన భవనం నిర్మాణం అయ్యేంత వరకు ప్రత్యామ్నాయంగా హోంగార్డ్ భవనంలోకి మార్చారు. త్వరగా పెట్రోల్ బంకు ఏర్పాటుతోపాటు ట్రాఫిక్ ఠాణా నూతన భవన నిర్మాణం చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.

మహిళల సంక్షేమానికి ఆరోగ్య కేంద్రాలు

- 13 నుంచి సీపీఆర్‌పై శిక్షణ
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు



పాల్గొన్న కలెక్టర్ బాదావత్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, పోలీసు, ఆరోగ్య సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 ఆరోగ్య మహిళా కేంద్రాలు ప్రారంభిస్తామని, అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వడ్డీ లేని రుణం బకాయిలు రూ.650కోట్లు విడుదల చేశామని, మహిళా దినోత్సవం రోజున జిల్లా స్థాయి వేడుకల్లో చెక్కులు పంపిణీ చేయాలని తెలిపారు. గుండెపోటు వచ్చే వారిలో 50శాతం మందిని సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది ఆరోగ్య కార్యకర్తలు, స్వశక్తి మహిళా సంఘాలు, ఆర్టీసీ, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, వివిధ వర్గాల ప్రజలకు ఈ నెల 13నుంచి సీపీఆర్ శిక్షణ అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, డీసీపీ సుధీర్ ఆర్ కేకన్ పాల్గొన్నారు.

మంచిర్యాల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని నాలుగు జంక్షన్ల అభివృద్ధి పనులకు శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జంక్షన్ల అభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయించగా, రూ.3.60 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఐబీ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం, టీటీడీ కల్యాణ మండపం ప్రాంతంలో ఫౌంటేన్, బెల్లంపల్లి చౌరస్తాలో గౌతమబుద్ధ శిల్పాలు, లక్ష్మీటాకీస్ చౌరస్తాలో నాలుగు గుర్రాల శిల్పాలు, జంక్షన్లు అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, మహిళా అధ్యక్షురాలు గరిగంటి సరోజ, కౌన్సిలర్లు మినాజ్, మాదంశెట్టి సత్యనారాయణ, జగ్గారి సుమతి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వాగ్వాదం

ప్రభుత్వ కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ పాల్గొనకుండా చేసి అధికార పార్టీ నాయకులు పనులు ప్రారంభించడంపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర చౌరస్తా వద్ద ఎమ్మెల్యేను నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన మనోహర్‌తో కొబ్బరికాయ కొట్టించడంతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోవడంతో కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాన్ని పక్కకు నెట్టేశారు. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

నేడు 'ఊరు మనదిరా' సాంస్కృతిక సభ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజాకవి గూడ అంజయ్య యాదిని పురస్కరించుకుని బెల్లంపల్లిలో ఆదివారం 'ఊరు మనదిరా' సాంస్కృతిక సభ నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ మలి ఉద్యమంలో తన పాటల ద్వారా ప్రజా చైతన్యానికి అంజయ్య తోడ్పడ్డారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే సభకు సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి కే.నారాయణ, ప్రజా యుద్ధనౌక గద్దర్, సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి, కవి గోరటి వెంకన్న, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరవుతారని తెలిపారు. సాంస్కృతిక సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు దాగం మల్లేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, బెల్లంపల్లి డివిజన్ అధ్యక్షుడు ఎల్తూరి శంకర్, బెల్లంపల్లి మండల సీపీఐ కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు జీసీ మాణిక్యం, ఆడేపు రాజమౌళి, భరత్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణం పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నస్పూర్: నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని త్వరగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన ఆర్‌అండ్‌బీ ఈఈ రాముతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అన్నారు. భవనం ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం విలేజ్ నస్పూర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధతపై సూచనలు చేశారు.

పోస్టల్ సేవింగ్స్ ఖాతా మేళాకు స్పందన

పాతమంచిర్యాల: జిల్లాలో తపాలాశాఖ ఫిబ్రవరి 20 నుంచి 28వరకు నిర్వహించిన పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ కొత్త ఖాతాల మేళాకు విశేష స్పందన లభించిందని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల సబ్ డివిజన్ పరిధిలోని పోస్టాఫీస్‌లలో 3900 కొత్త సేవింగ్ ఖాతాలు తెరిచినట్లు వివరించారు. కొత్త ఖాతాల నమోదులో దేశవ్యాప్తంగా ఉన్న 47పోస్టల్ రీజియన్‌లలో తెలంగాణ రీజియన్ 4వ స్థానంలో నిలువగా తెలంగాణ సర్కిల్‌లోని హైదరాబాద్ రీజియన్‌లోని 17పోస్టల్ డివిజన్‌లలో ఆదిలాబాద్ డివిజన్ రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. పోస్టల్ ఖాతాలు తెరువాలనుకునే వారికి పోస్టల్ శాఖ తమ ఇంటి వద్దే నుంచే ఖాతాను తెరుచుకునే అవకాశం కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

స్పోర్ట్స్ అకాడమీ ఎంపిక పోటీలు



ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి హైదరాబాద్‌లో 4వ తరగతి చదువుతున్న గిరిజనేతర విద్యార్థులకు శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14న వాటర్ స్పోర్ట్స్ అకాడమీ హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని ఏటీడీవో చిరంజీవి, జిల్లా గిరిజన క్రీడలాభివృద్ధి అధికారి బండ జీవరత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ గర్ల్స్ హెచ్ఎం కృష్ణారావు, కోచ్ ఎం.విద్యాసాగర్, ఆర్.సత్యనారాయణ, సురేందర్, హెచ్‌డబ్ల్యూవో మల్లారెడ్డి, చందు, రఘునాథం, పీడీ, పీఈటీలు మీనారెడ్డి, గంగాభవాని, ధనలక్ష్మీ, కమలాకర్, హరికుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఏబీవీపీ వినూత్న నిరసన



స్థానిక ఐబీ చౌరస్తాలో భిక్షాటనతో నిరసన

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాలలో భిక్షాటన చేస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా రోజు రోజుకు విద్యార్థుల పరిస్థితి హీనమైన స్థితికి దిగజారుతోందని తెలిపారు. భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బులను కలెక్టర్‌కు అందజేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాధ్యులు ప్రదీప్, ఆఫ్రీద్, నవీన్ సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

– జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ద్వారా రానున్న ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2, 3, 4 ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షల కోసం హాజరయ్యే మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు అందించడం జరుగుతోందని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ప్రకటనలో తెలిపారు. మే నెల మొదటి వారం నుంచి 60 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులకు ఈ నెల 6 నుంచి 15 వరకు సాయంత్రం 5గంటల లోపు జిల్లా కేంద్రంలో ఫ్లై ఓవర్ వంతెన సమీపంలోని గోసేడ మండల కాలనీలోని జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం, హైదరాబాద్‌లోని గన్ ఫౌండ్రీ, జామియా నిజామియా కాంప్లెక్స్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్‌లో అందించవచ్చని తెలిపారు. లేదా coachingfominorities. hyd@hyd@gmail.com ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కోసం 08736–259911లో సంప్రదించవచ్చని, మొదట దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అనుమానంతో భార్యపై దాడి

- చికిత్స పొందుతూ మృతి

మంచిర్యాలక్రైం: అనుమానంతో భార్యపై భర్త దాడిచేసిన సంఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో వారం రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సీఐ రాజు వివరాల ప్రకారం... పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద నివసిస్తూ భిక్షాటన చేస్తూ చింతల జ్యోతి(35) భర్త షేక్ ఇమ్రాన్‌లు జీవనం సాగిస్తున్నారు. ఇమ్రాన్ జ్యోతిపై అనుమానం పెంచుకుని గత నెల 28న దాడి చేసి గాయపరిచాడు. జ్యోతిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిపించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. భర్తపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం మార్కెట్ ఏరియా మామిడితోట సమీపంలో శనివారం పేకాటడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,930 నగదును స్వాధీనపర్చుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

ఆసిఫాబాద్‌రూరల్: అదుపు తప్పి లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని బూర్గుడలో శని వారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మహా రాష్ట్రకు పసుపు లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రాత్రి 3 గంటలకు మండలంలోని బూర్గుడ వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద శనివారం రాత్రి ఆటో బోల్తాపడగా చోదకుడు మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం.. హంగిర్గా గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె గౌతం(35) ఆటో చోదకుడు హంగిర్గా గ్రామం నుంచి ఆటోలో భైంసాకు వెళ్తున్నాడు. హంగిర్గా గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో బోల్తాపడగా గౌతంకు తీవ్ర గాయాలయ్యాయి.

సోషల్‌లో మీడియా..!



సండే స్పెషల్

- సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ
- ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రత్యేక దృష్టి
- కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు పోస్టులు

సాక్షి, మంచిర్యాలడెస్క్: సోషల్ మీడియాకు ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదు. ఫేస్‌బుక్.. ఇన్‌స్టాగ్రాం.. ట్విట్టర్ ఇలా ఏదో ఒక వేదికగా చాలామంది సోషల్ మీడియాలో ఖాతాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో వ్యక్తి రోజులో సగటున రెండున్నర గంటలు సామాజిక మాధ్యమాలపై గడుపుతున్నారు. అందుకే సోషల్ మీడియా అనేది సమాచార వ్యాప్తికి ప్రధాన వారధిగా మారింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీల నాయకులు సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజువారీగా కార్యక్రమాలు, పర్యటనలు ఫొటోలతో పోస్టు చేయిస్తున్నారు.

ప్యాకేజీ..

సోషల్ మీడియాలో పండుగలు, నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు, శుభాకాంక్షలు తెలియజేయడం, ప్రభుత్వ పథకాలపై పోస్టుల కోసం ప్యాకేజీతో కొందరు పని చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల సమయంలో ప్రజాప్రతినిధుల ఫొటోలతో డిజైన్ చేసి ఇస్తుంటారు. ఏడాదికి ప్యాకేజీ రూ.2.50లక్షల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక సిబ్బంది

ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న నాయకుల వద్ద సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద ఇద్దరు నుంచి ముగ్గురు ఉన్నా రు. వ్యక్తిగత పీఆర్వోలు, పీఏలుగా వ్యవహరిస్తున్నారు. వీరికి కనిష్టంగా రూ. 15వేల నుంచి గరిష్టంగా రూ.30వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో ఫొటోలు, ఆ అంశానికి సంబంధించిన సమాచారం పోస్టు చేయడమే వీరి పని. కొంతమంది ప్రజాప్రతినిధులకు సంబంధించిన వారు హైదరాబాద్ నుంచి ఖాతాల నిర్వహణ చూస్తున్నారు. ఇక్కడున్న వారు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తుంటారు. ఫొటోలు తీయడానికి ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్లు కూడా ఉన్నారు.

పార్టీల్లో సోషల్ మీడియా కమిటీలు

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సోషల్ మీడియా కమిటీలు కూడా వేశాయి. మండలం, నియోజకవర్గాల వారీగా కన్వీనర్లు, కోఆర్డినేటర్లుగా ఉన్నారు. ఆయా పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. తమ తమ పార్టీల విధానాలను ప్రచారం చేస్తూనే ప్రత్యర్థి పార్టీలను ప్రశ్నిస్తున్నారు.

కొత్త పంథా..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ఎన్ఆర్ఐ ప్రత్యేకంగా రెండు టీవీ చానళ్లనే తీసుకొచ్చారు. జిల్లాతోపాటు మరికొన్ని జిల్లాల్లో ఈ చానళ్ల ప్రసారాలు వస్తున్నాయి. ప్రధానంగా ఆయనకు సంబంధించిన కార్యక్రమాలు ప్రసారం చేస్తూనే మరికొన్ని ప్రసారాలు వస్తుంటాయి.

- నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రతిపక్ష పార్టీ నాయకుడు సోషల్ మీడియాలో ఖాతాల నిర్వహణపై అంతగా దృష్టి సారించకున్నా.. తనదైన శైలిలో మూడు, ఆరు నెలలకోసారి సర్వే చేయిస్తుంటారు. తన కార్యక్రమాలు, ప్రజల స్పందన ఎలా ఉందనే వాటిపై ఆరా తీస్తుంటారు. అందుకు అనుగుణంగా తన ప్రణాళిక మార్చుకుంటున్నారు.

కమ్యూనిస్టు పార్టీలూ...

తూర్పు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీల నాయకులూ సోషల్ మీడియాలో చురుగ్గానే ఉన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని సీపీఎం, సీపీఐ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నారు.

ఖాతాల్లో అనుసరణ ఇలా..

	Facebook	Twitter
చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్	1,19,000	1,91,000
మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి	73000	39,300
మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు	23,000	12,400
ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న	16000	14,200
బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు	8,200	2,016
సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప	45,000	5,524

ప్రజాప్రతినిధులు/నాయకుల ఫేస్‌బుక్‌లో ఫాలోవర్లు

ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు	13,000
బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్	3,200
బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య	2,400
కాంగ్రెస్ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి	62,000
ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి	6,100
మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి	33,000
మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు	13,000
ఆదిలాబాద్ బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి	51,000

ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తాం



ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం. ఆదిలాబాద్ మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని మావల, బేల, జైనథ్, ఆదిలాబాద్ రూరల్ మండలాల బీఆర్ఎస్ శ్రేణులకు సమాచారం చేరవేస్తాం. ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ప్రచారం చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం.

– ప్రశాంత్, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, ఆదిలాబాద్

కార్యక్రమాలు తెలియజేస్తాం..



సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తుంటాం. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావుకు సంబంధించి పార్టీ కార్యక్రమాలను మీడియా, సోషల్ మీడియాలో పంపించే బాధ్యతలు చూస్తున్నాను. పార్టీ అధిష్టాంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా ద్వారా పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతిధులకు చేరవేస్తుంటాను.

– దాసరి సాయికృష్ణ, మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్

ప్రజల నుంచి సానుకూల స్పందన



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు, ప్రజావ్యతిరేక విధానాలపై సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటా ను. ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తుంది. నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల విధానాలు, వారిపై వస్తున్న వ్యతిరేకతను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తుంటాను. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీ సుకెళ్లడానికి సోషల్ మీడియా ఉపయోగపడుతుంది.

– వేల్పుల రోహిత్, కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్

చిలకల భీమన్న ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని చిలకల భీమన్న ఆలయంలో ఆదివాసీలు శనివారం పూజలు చేశారు. ఈ భీమన్న ఆలయంలో ఇటీవల దుండగులు నిప్పుపెట్టారు. ఈ ప్రమాదంలో పలు దేవతామూర్తుల విగ్రహాలు కాలిపోగా ఆలయం ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో ఆలయంలో దేవతా విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన సుమారు 200 కుటుంబాల ఆదివాసీలతో పాటు, సమీప గ్రామాల ప్రజలు చిలకల భీమన్నను ఆరాధిస్తుంటారు. ఆలయంలో జరిగిన విధ్వంసంతో ఆదివాసీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆలయాన్ని పునరుద్ధరించే క్రమంలో ఆలయంలో మరమ్మతులు చేపట్టారు. నూతన విగ్రహాలను తయారు చేసి గిరిజన సంప్రదాయాల ప్రకారం పూజలు ప్రారంభించారు. పూజారి చిలకయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి కాగజ్‌నగర్ మండలంలోని కడంబా భీమన్న ఆలయానికి విగ్రహాలను తీసుకువెళ్లారు. అక్కడ జలాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. చింతలమానెపల్లి భీమన్న ఆలయానికి విగ్రహాలను తీసుకు వస్తామని అనంతరం వాటిని పునఃప్రతిష్ఠ చేస్తామని ఆదివాసీ నాయకులు బుర్రి నీలయ్య తెలిపాడు.

జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో యూపీహెచ్‌సీ(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్), ఆర్‌బీఎస్‌కే ఆయుష్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నామని, దరఖాస్తుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ప్రావిజినల్ జాబితా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో, మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్ ww.mancherial.telangana.gov.in లో ఉంచామని, అభ్యర్థులు అభ్యంతరాలను ఈ నెల 6 నుంచి 8లోగా కార్యాలయ పనివేళల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

పాత పెన్షన్ స్కీం అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: తెలంగాణలో డీఎస్సీ -2003 ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగులందరికీ పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. 3 మార్చి 2023 కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57 సవరిస్తూ డిసెంబర్ 30, 2023 లోపల ఉద్యోగులకు పాత పింఛన్ పథకం అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జూన్ 2020 లోనే ఉపాధ్యాయులు, ఉద్యోగ వివరాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటి వరకు పాత పెన్షన్ స్కీం అమలు చేయకపోవటంతో 16వేల మంది నిరాశతో ఉన్నారని, ఇకనైనా తెలంగాణలో అమలు చేయాలన్నారు.

రేపు నిశ్చితార్థం అనగా...

- పెళ్లికి నిరాకరించిన అబ్బాయి బంధువులు
- మనస్తాపంతో పురుగుల మందుతాగిన యువతి
- మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి
- ఒక్కగానొక్క కూతురు మృతితో తల్లడిల్లిన తల్లిదండ్రులు
- చింతకర్రలో తీవ్ర విషాదం



మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు



జ్ఞానేశ్వరి(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): ఇరువురు పెద్దలు మాట్లాడుకున్నారు.. నిశ్చితార్థానికి తేదీ ఖరారు చేశారు. దీంతో అమ్మాయి తండ్రి నిశ్చితార్థం కోసం బంధువులందరికీ సమాచారమిచ్చాడు. ఒక రోజు దాటితే నిశ్చితార్థం.. అంతలోనే పెళ్లి కుదరదని అబ్బాయి తరుపువారు ఫోన్‌లో తెలిపారు. క్షణికావేశంలో మనస్తాపానికి గురైన జ్ఞానేశ్వరి (19)పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన కెరమెరి మండలంలోని చింతకర్ర గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని చింతకర్ర గ్రామానికి చెందిన మడపచి యశ్వంత్ రావు, రాంబాయి దంపతులకు ఏకైక సంతానం జ్ఞానేశ్వరి, ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. ఆసిఫాబాద్ మండలంలోని ఆడ దస్నాపూర్ గ్రామానికి చెందిన ఆనంద్‌రావు, సుందరీబాయిల కుమారుడు అక్బర్‌షాతో వివాహానికి ఇరువురు పెద్దలు అంగీకరించారు. ఈ నేపథ్యంలో గత శనివారం అమ్మాయి బంధువులు ఆడదపస్నాపూర్‌కు వెళ్లి పెళ్లి విషయంపై మాట్లాడుకున్నారు. ఈ నెల 2వ తేదీన నిశ్చితార్థం చేయాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే మంగళవారం నిశ్చితార్థన్ని రద్దు చేస్తున్నామని, గురువారం మా ఇంటికి రావద్దని అబ్బాయి బంధువులు ఫోన్ చేశారు. విషయం విన్న జ్ఞానేశ్వరి మనస్తాపానికి గురైంది. సమాజంలో మా పరువు పోయిందని భావించిన గ్యానేశ్వరి మంగళవారం ఇంట్లోనే పురుగుల మందు తాగించి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఒక్కగానొక్క కూతురు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపారు.

ఏఎస్‌వో నియామకంలో జాప్యం

- రక్షణ చర్యల్లో కీలక పోస్టు
- నెల రోజులుగా ఇన్‌చార్జితోనే సరి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో పర్మినెంట్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్ (ఏఎస్‌వో) లేరు. కంపెనీలోనే అధిక భూగర్భ గనులు, మూడొంతుల ఉద్యోగులు పనిచేస్తున్న ఈ ఏరియాలో పర్మినెంట్ సేఫ్టీ ఆఫీసర్ లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎస్సార్పీ 3 గనిలో గ్యాస్ ప్రమాదం జరగడంతో వారం రోజులుగా పనులు నిలిపివేసి ఉద్యోగులకు లేఆఫ్ ఇచ్చారు. ఈ సమయంలో కూడా పర్మినెంట్ ఏఎస్‌వో లేకపోవడం రక్షణ చర్యల్లో ఉన్న డొల్లతనాన్ని తెలియజేస్తోంది. ఏరియా లెవల్‌లో సేఫ్టీని నిత్యం మానిటరింగ్ చేసే ఏఎస్ఓ పోస్టు ఖాళీగా ఉంచడం సరికాదని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన గోషిక మల్లేశ్ 2023, జనవరి 31న రిటైరయ్యారు. అప్పటి నుంచి ఆయన స్థానంలో యాజమాన్యం పర్మినెంట్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌ను నియమించకుండా ఓ అడిషనల్ మేనేజర్‌కే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ భూగర్భ గనులు అధికంగా ఉండడంతో ప్రమాదాలకు ఎక్కువగా ఆస్కారం ఉంటుంది. ఏరియాలోని అన్ని గనుల్లో దిగి రక్షణ చర్యలు ఎలా ఉన్నాయి, గని అధికారులు సరైన రక్షణ చర్యలు చేపడుతున్నారా? ఎక్కడైనా ప్రమాదాలకు ఆస్కారం ఉందా? అని నిత్యం రక్షణపై సమీక్షలు చేయడం, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టడంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ కీలక పాత్ర పోషించాలి.

పైస్థాయి అధికారిని ఎలా అజమాయించగలరు...

ఇన్‌చార్జి ఏఎస్ఓ ఏరియాలోని అన్ని గనులను తనిఖీ చేసి రక్షణ చర్యలను పరిశీలించాలి. తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఎక్కడైనా ఉల్లంఘన ఉంటే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అడిషనల్ మేనేజర్ స్థాయి అధికారి ఇన్‌చార్జి ఏరియా సేఫ్టీ అధికారిగా ఉన్నా కూడా తన కంటే పైహోదా గల డెప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో ఉండే గని మేనేజర్‌ను రక్షణపై ఏ విధంగా అజమాయించి రక్షణ పనులు చేయించ గలుగుతారని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. కంపెనీ వ్యాప్తంగా రక్షణను పటిష్టం చేయడం కోసం ప్రత్యేకంగా ఉన్నా ఇంటర్నల్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) అధికారులు కూడా ఈ పోస్టు భర్తీలో జరిగే జాప్యంతో విమర్శలు ఎదుర్కొవాల్సి వస్తోంది. ఇప్పటికైనా పర్మినెంట్ ఏరియా సేఫ్టీ అధికారిని నియమించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిచ్చుపల్లి గ్రామానికి చెందిన తొడాపం శ్యాంరావు–సంధ్య (21) దంపతులు శుక్రవారం ఉదయం వారి బైక్‌పై మహారాష్ట్రలోని షెడ్‌వావి గ్రామానికి వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మండలంలోని బంబార గ్రామ సమీపంలో శ్యాంరావు సెల్ ఫోన్ కింద పడిపోయింది. దీంతో ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కకు నిలిపి సెల్ ఫోన్ కోసం రోడ్డుపై వెతుకుతుండగా గుర్తు తెలియని వాహనం సంధ్యను ఢీకొంది. దీంతో సంఘటన స్థలంలోనే మృతిచెందింది. వీరికి రెండేళ్ల క్రితమే వివాహమైంది. మృతురాలి తండ్రి మేస్రం జంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

దండేపల్లి: మండలంలోని గూడెం శివారులో కుక్కల దాడిలో శనివారం గొర్రెలు మృతి చెందాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లి గ్రామానికి ఈరన్న, పోచన్నలు తమ గొర్రెలను మేపుకుంటు దండేపల్లి మండలం గూడెం గ్రామానికి వచ్చి గ్రామ శివారులో గొర్రెలు మేపుతుండగా మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 16 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ రూ.90వేలు ఉంటుందని బాధితులు వాపోయాడు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



బాపూజీ (ఫైల్)

కెరమెరి: మండలంలోని సావర్‌కెడా గ్రామానికి చెందిన గుర్నులే బాపూజీ (37) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నల్లా సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... బాపూ జీ కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు కెరమెరి పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య అనిత, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడవుల సంరక్షణకు చర్యలు

కడెం: అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఖానాపూర్, జన్నారం ఎఫ్‌డీవోలు కోటేశ్వర్‌రావు, మాధవరావు అన్నారు. శనివారం మండలంలోని ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలోని కల్పకుంట వద్ద కెరమెరి, ఆసిఫాబాద్, ఖానాపూర్, జన్నారం, ఇంధన్‌పల్లి, బీర్సాయిపేట్, ఉట్నూర్, ఉడుంపూర్, కడెం, అటవీ రేంజ్‌ల సిబ్బందితో క్లస్టర్ బార్డర్ ప్రొటెక్షన్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఎఫ్ఆర్వోలు అనిత, అప్పలకొండ, గులాం మెయినోద్దీన్, అనిత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూతురు మృతి.. తండ్రికి గాయాలు

- బైక్‌ను ఢీకొన్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు
- ఆరోగ్యం బాగాలేక తండ్రితో ఇంటికి వస్తుండగా ఘటన
- ఉద్యోగం వచ్చిన మూడు నెలలకే..



కల్పన (ఫైల్)

సారంగపూర్: కుటుంబాన్ని పోషించేందుకు ఆ కుటుంబం వలస వచ్చింది. తండ్రి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి కష్టాన్ని గుర్తించిన కూతురు కష్టపడి చదువుకుని మూడు నెలల క్రితమే ఉద్యోగం సాధించింది. ఆరోగ్యం బాగులేక ఇంటికి తండ్రితో కలిసి వస్తుండగా ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొనగా సంఘటన స్థలంలోనే మృతిచెందింది. ఈ విషాద సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఈద్‌గాం గ్రామంలో పోస్ట్‌మాస్టర్‌గా రాథోడ్ కల్పన (19) పనిచేస్తోంది. కుటుంబ సభ్యులు గతంలో కుంటాల మండలంలోని ఓలా గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడే తండ్రి రాథోడ్ దత్తురాం ఓ రైస్‌మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితమే కూతురు కల్పనకు తపాలా శాఖలో బీపీఎంగా ఉద్యోగం వచ్చింది. కూతురి ఆరోగ్యం బాగోలేక తండ్రి తీసుకురావడానికి కాగజ్‌నగర్ వెళ్లాడు. తిరిగి ఇంటికి బైపాస్ మీదుగా మహబూబాఘాట్స్ నుంచి బైక్‌పై వస్తుండగా గోపాల్‌పేట్ ఎక్స్‌రోడ్డు మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కల్పన ఎగిరిపడి తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. తండ్రి దత్తురాంకు తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబానికి కుమారుడిలా చేదోడువాదోడుగా నిలిచే కుమార్తె మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వసంత్ తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన అడ్డిగా సాయన్న(70) ఉరేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... సాయన్న కొంత కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండ్రోజులుగా నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తితో శనివారం తన తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.